క్లుప్తంగా

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

నేరడిగొండ: గ్రామాల్లో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎంపీడీవో రాజవీర్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని ఎంపీడీవో సమావేశ మందిరంలో పంచాయతీ కార్యదర్శులు, ఉపాధిహామీ టెక్నికల్ అసిస్టెంట్లు, ఫీల్డ్ అసిస్టెంట్లతో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. గ్రామాల్లో పరిసరాలను పరిశుభ్రంగా ఉంచేలా ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. దోమల నివారణకు డ్రెయినేజీలు, నీటి నిల్వ ప్రాంతాల్లో మందులు చల్లించాలన్నారు. వర్షాలు సమృద్ధిగా కురుస్తున్నందువల్ల విరివిగా మొక్కలు నాటాలన్నారు. సమావేశంలో ఎంపీవో లక్ష్మణ్, ఈజీఎస్ ఏపీవో వసంత్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి



మాట్లాడుతున్న ఎస్సై నరేష్

ఇచ్చోడ: విద్యార్థులు మత్తు పదార్థాలు, మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని ఎస్సై నరేష్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని గిరిజన గురుకుల బాలుర కళాశాలలో విద్యార్థులకు అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎంతో భవిష్యత్ ఉన్న విద్యార్థులు చెడు అలవాట్లకు దూరంగా ఉంటే అనుకున్న లక్ష్యాలను చేరుకుంటారన్నారు. ప్రస్తుతం సైబర్ నేరాలు ఎక్కువయ్యాయని, అపరిచితుల నుంచి వచ్చిన ఫోన్‌కాల్స్‌కు సమాధానం ఇవ్వవద్దన్నారు.

దోమల నివారణకు చర్యలు తీసుకోవాలి



సుభాష్‌నగర్‌లో పరిశీలిస్తున్న అధికారి సాగర్

ఇచ్చోడ: వర్షాకాలంలో దోమలు వ్యాప్తి చెందకుండా జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా క్షయ వ్యాధి నివారణ అధికారి సాగర్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని సుభాష్‌నగర్, విద్యానగర్ కాలనీల్లో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షం నీరు నిల్వ ఉంటే దోమలు వ్యాప్తి చెందుతాయన్నారు. దీంతో డెంగీ లాంటి వ్యాధులు ప్రబలుతాయన్నారు. నివాస పరిసర ప్రాంతల్లో నీటి నిల్వలు ఉండకుండా ప్రతిఒక్కరూ జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఆయన వెంట సబ్ యూనిట్ అధికారి రవీందర్, హెల్త్ సూపర్‌వైజర్ ఉత్తం సింగ్, సిబ్బంది రాజుబాయి, కైలాస్, వసంత్, సుభాష్, సుజాత, ఆశ వర్కర్లు ఉన్నారు.

దివ్యాంగుడికి చేయూత



సర్టిఫికెట్ రెన్యువల్ చేయిస్తున్న ఇమ్రాన్

ఆదిలాబాద్‌టౌన్: దివ్యాంగుడికి హ్యాండీక్యాప్ హెల్పింగ్ వెల్ఫేర్ సొసైటీ చేయూత అందించింది. ఆదిలాబాద్ పట్టణానికి చెందిన మానసిక వికలాంగుడైన పంకజ్‌కు ఆరు నెలల నుంచి పింఛన్ రాకపోవడంతో సొసైటీ సభ్యులకు సమస్య తెలియజేశాడు. స్పందించిన ఆ సొసైటీ అధ్యక్షుడు మహ్మద్ ఇమ్రాన్ బుధవారం సదరం సర్టిఫికెట్ రెన్యూవల్ కోసం రిమ్స్ ఆస్పత్రికి వెళ్లారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి ఫైసల్ అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

వన్‌టౌన్ ఎస్సైగా అశోక్ బాధ్యతల స్వీకరణ



డీఎస్పీకి పూలమొక్క అందిస్తున్న ఎస్సై

ఆదిలాబాద్‌టౌన్: ఆదిలాబాద్ వన్‌టౌన్ ఎస్సైగా అశోక్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. జిల్లాలో పనిచేసిన ఆయన ఎన్నికల సమయంలో నిజామాబాద్ జిల్లాకు బదిలీపై వెళ్లిన ఆయన తిరిగి జిల్లాకు బదిలీపై వచ్చారు. బాధ్యతలు స్వీకరించిన అనంతరం ఆదిలాబాద్ డీఎస్పీ ఎల్.జీవన్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి పూలమొక్కను అందజేశారు.

బీటీరోడ్లకు మోక్షమెప్పుడో?



అసోద బొప్పాపూర్ గ్రామానికి వెళ్లే రోడ్డు దుస్థితి

- 12 రోడ్లకు రూ.13 కోట్లు మంజూరు
- ప్రారంభంకాని నిర్మాణ పనులు
- ఇబ్బందులు ఎదుర్కొంటున్న ప్రజలు

ఆదిలాబాద్‌రూరల్: నియోజకవర్గంలోని పలు గిరిజన గ్రామాలకు అనేక ఏళ్లుగా రోడ్డు సౌకర్యాలు లేవు. దీంతో పలు గ్రామాలకు చెందిన ప్రజలు వర్షాకాలంలో రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రజల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకున్న ప్రభుత్వం బీటీరోడ్ల నిర్మాణం కోసం నిధులు సైతం మంజూరు చేసింది. నిర్మాణ పనుల్లో మాత్రం జాప్యం జరగడంతో ఆయా గ్రామాల ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

నిర్మాణ పనుల్లో తీవ్ర జాప్యం

ఆదిలాబాద్ నియోజకవర్గ పరిధిలో ఆదిలాబాద్ పట్టణంతో పాటు ఆదిలాబాద్ రూరల్, మావల, జైనథ్, బేల మండలాలు ఉన్నాయి. ఇందులో గ్రామీణ మండలాల్లోని గిరిజన గ్రామాలకు బీటీ రోడ్డు సౌకర్యం కల్పించేందుకు ఎస్టీ ఎస్డీఎఫ్ నుంచి నిధులు మంజూరు చేశారు. పనులు దక్కించుకున్న కాంట్రాక్టర్లు నిర్మాణ పనులు ప్రారంభించడంలో తీవ్ర జాప్యం చేస్తుండడంతో నియోజకవర్గ ప్రజలు రాకపోకలు సాగించేందుకు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

12 రోడ్లకు నిధులు మంజూరు

నియోజకవర్గంలోని వివిధ మండలాల్లోని 12 గ్రామాలకు 21 కిలోమీటర్ల మేర బీటీరోడ్డు నిర్మాణానికి 2024–25 ఆర్థిక సంవత్సరంలో ప్రభుత్వం రూ.13.06 కోట్ల నిధులు మంజూరు చేసింది. వివిధ కారణాలతో రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభానికి నోచుకోవడం లేదు. ఇందులో ఆదిలాబాద్ రూరల్ మండలంలో దహిగూడ నుంచి మామిడికొరీ, కచికంటి నుంచి చిట్యాల్‌బోరి, ఖండాల నుంచి ధర్‌లొద్దీ, అసోదా బొప్పపూర్, మావల మండలంలోని వాఘాపూర్ నుంచి కొలాంగూడలతో పాటు జైనథ్, బేల మండలాల్లోని పలు గిరిజన గ్రామాలకు బీటీ రోడ్డు నిర్మాణం చేపట్టనున్నారు.

తప్పని తిప్పలు

బీటీ రోడ్డు నిర్మాణాల కోసం నిధులు మంజూరైనా పనులు ప్రారంభం కాకపోవడంతో నియోజకవర్గంలోని పలు గిరిజన గ్రామాలకు చెందిన ప్రజలకు తిప్పలు తప్పడం లేదు. నిధులు మంజూరయ్యాయన్న సంతోషం తప్పా పనులు ప్రారంభం కావడం లేదని పలు గ్రామాలకు చెందిన గిరిజనులు పేర్కొంటున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి రోడ్డు నిర్మాణ పనులు త్వరలో ప్రారంభమయ్యేలా చూడాలని కోరుతున్నారు.

త్వరలో ప్రారంభమయ్యేలా చూస్తాం



ఆదిలాబాద్ నియోజకవర్గంలోని పలు గిరిజన గ్రామాలకు బీటీ రోడ్ల నిర్మాణానికి నిధులు మంజూరయ్యాయి. కాంట్రాక్టర్లు టెండర్లు సైతం దక్కించుకున్నారు. కొన్నిచోట్ల కల్వర్టుల నిర్మాణాలు సైతం జరిగాయి. కొన్నిచోట్ల వివిధ కారణాలతో పనులు ప్రారంభం కావాల్సి ఉంది. త్వరలో పనులు ప్రారంభమయ్యేలా చర్యలు తీసుకుంటాం.

– సుధాకర్, ఏఈ, ఐటీడీఏ, ఆదిలాబాద్

రైతు ధర్నా విజయవంతం చేయాలి

- బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్



మాట్లాడుతున్న ఎమ్మెల్యే అనిల్ జాదవ్

నేరడిగొండ: రైతులకు ఎలాంటి ఆంక్షలు లేకుండా రైతు రుణమాఫీ చేయాలని డిమాండ్ చేస్తూ బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో ఇచ్చోడలో గురువారం చేపట్టనున్న రైతు ధర్నాను విజయవంతం చేయాలని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ కోరారు. బుధవారం మండల కేంద్రంలోని ఆయన నివాసంలో నియోజకవర్గ ముఖ్య నాయకులతో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీ మేరకు ప్రతీ రైతుకు రూ.2లక్షల రుణమాఫీ చేయాలని డిమాండ్ చేస్తూ నియోజకవర్గంలోని రైతులతో కలిసి ఇచ్చోడలో ధర్నా నిర్వహిస్తున్నామని, రైతులు అధిక సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో తాజా మాజీ ఎంపీపీలు తుల శ్రీనివాస్, రాథోడ్ సజన్, మాజీ జెడ్పీటీసీ సంధ్యారాణి, తదితరులు పాల్గొన్నారు.

షరతులు లేకుండా రుణమాఫీ చేయాలి



టీజీబీ వద్ద నిరసన తెలుపుతున్న బీఆర్ఎస్ నాయకులు

నేరడిగొండ: అర్హులైన రైతులందరికీ షరతులు లేకుండా రుణమాఫీ చేయాలని తాజామాజీ ఎంపీపీ రాథోడ్ సజన్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు అల్లూరి శివారెడ్డి డిమాండ్ చేశారు. బుధవారం మండల కేంద్రంలోని తెలంగాణ గ్రామీణ బ్యాంక్ వద్ద రైతులతో కలిసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు రుణమాఫీ చేయని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తక్షణమే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. రూ.31వేల కోట్ల రుణమాఫీ చేస్తామని రూ.17వేల కోట్లు మాత్రమే మాఫీ చేశారని మండిపడ్డారు. రైతులందరికీ రుణమాఫీ అయ్యేంత వరకు పోరాడుతామన్నారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ మాజీ చైర్మన్ సాబ్లే నానక్‌సింగ్, మాజీ జెడ్పీటీసీ అంబేకర్ పండరి, బీఆర్ఎస్ నాయకులు ఏలేటి రవీందర్ రెడ్డి, జాదవ్ గణేశ్, దేవేందర్‌రెడ్డి, రాథోడ్ సురేందర్, వసంత్‌రావు, సుజీల్, రైతులు పాల్గొన్నారు.

పంచాయతీ కార్యదర్శిపై సస్పెన్షన్ ఎత్తేయాలి

తాంసి: నార్నూర్ గ్రామ పంచాయతీ కార్యదర్శిపై సస్పెన్షన్ ఎత్తివేయాలని భీంపూర్ మండల పంచాయతీ కార్యదర్శులు భీంపూర్ కార్యాలయంలో ఎంపీడీవో గోపాలకృష్ణ రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పంచాయతీ కార్యదర్శులు మాట్లాడుతూ సస్పెన్షన్‌కు నిరసనగా నాలుగు రోజుల పాటు సామూహిక సెలవులపై వెళ్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు సాయి కుమార్, సతీష్, నర్సయ్య, రవికాంత్, సునీత, దివ్య, తదితరులు పాల్గొన్నారు.

బంద్ విజయవంతం



ఇంద్రవెల్లి: బైక్ ర్యాలీ నిర్వహిస్తున్న నాయకులు



తలమడుగు: బైక్‌ర్యాలీ నిర్వహిస్తున్న నాయకులు



ఉట్నూర్‌రూరల్: నిరసన తెలుపుతున్న నాయకులు

ఇంద్రవెల్లి: ఎస్సీ వర్గీకరణను వ్యతిరేకిస్తూ బుధవారం నిర్వహించిన భారత్ బంద్ మండల కేంద్రంలో విజయవంతమైంది. మండల కేంద్రంలో అంబేద్కర్ మెమోరియల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ నిర్వహించి దుకాణాలు బంద్ చేయించారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ మండల అధ్యక్షుడు సోన్‌కాంబ్లే మనోహర్, మండల ప్రధాన కార్యదర్శి వాగ్మారే కాంరాజ్, ఉపాధ్యక్షులు పవార్ శివాజీ, కోశాధికారి కాంబ్లే సునీల్, దళిత సంఘాల నాయకులు మోరే దిలీప్, వావల్కర్ శివాజీ, భవాలే సత్యానంద్, సుద్ధోధన్, ఆచార్య దత్త, సునీల్, కాంబ్లే ధమ్మనంద్, సుమిత్, రూపేష్ పాల్గొన్నారు.

తలమడుగు: మండలంలోని సుంకిడి, తలమడుగు, ఖోడథ్, బరంపూర్, కొత్తూర్, కుచులాపూర్ గ్రామాల్లో దుకాణాలు, విద్యాసంస్థలు బంద్ చేశారు. మాల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ నిర్వహించారు.

ఉట్నూర్‌రూరల్: మాల మహానాడు జాతీయ కమిటీ ఆధ్వర్యంలో ప్రధాన వీధుల గుండా ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఉట్నూర్ ఆర్డీవో కార్యాలయంలో వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి దాసండ్ల ప్రభాకర్, నాయకులు సుశీల్, రమేశ్, గొల్లపల్లి నర్సయ్య, తొటి ఆశన్న, రాజమణి, అచ్చనందం, రాజు, తదితరులు పాల్గొన్నారు

తాంసి: మండల కేంద్రంలో మాల సంఘం అధ్యక్షుడు కమ్మరి శ్రీనివాస్, మహర్ సంఘం అధ్యక్షుడు సృజన్ పాటిల్ ఆధ్వర్యంలో వ్యాపార సముదాయాలను బంద్ చేయించారు. కార్యక్రమంలో మాల సంఘం నాయకులు భూమన్న, సుధాకర్, ప్రకాష్, శ్రీనివాస్, సంతోష్, తదితరులు పాల్గొన్నారు.

వర్గీకరణకు వ్యతిరేకంగా ర్యాలీ

జైనథ్: మాల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో వర్గీకరణకు వ్యతిరేకంగా బుధవారం మండల కేంద్రంలోని ప్రధాన వీధులగుండా ర్యాలీ నిర్వహించారు. బస్టాండ్ సమీపంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద నివాళులర్పించారు. తహసీల్దార్ శ్యాంసుందర్‌కు వినతిపత్రం అందించారు. .

ఎస్సీ వర్గీకరణ ప్రక్రియ నిలిపివేయాలి



రాస్తారోకో చేస్తున్న బీఎస్పీ నాయకులు

ఇచ్చోడ: ఎస్సీ వర్గీకరణ ప్రకియ వెంటనే నిలిపివేయాలని బీఎస్పీ బోథ్ నియోజకవర్గ ఇన్‌చార్జి మెస్రం జంగుబాపు డిమాండ్ చేశారు. బుధవారం మండల కేంద్రంలోని అంబేడ్కర్ చౌరస్తాలో వర్గీకరణకు వ్యతిరేకంగా రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణపై పార్లమెంట్‌లో చట్టం చేయాలన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వర్గీకరణపై తప్పుగా వ్యవహరిస్తున్నాయని ఆరోపించారు. సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును ఎస్సీ, ఎస్టీ కుల సంఘాలు, బహుజనవాదులు, బహుజన సమాజ్ పార్టీ పూర్తిగా వ్యతిరేకిస్తున్నాయన్నారు. వర్గీకరణ తీర్పును వెంటనే వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు రత్నపురం రమేష్, మాల సంఘం మండల అధ్యక్షుడు బొజ్జ లక్ష్మణ్, నాయకులు ఉషన్న, నరేందర్, రాజ్‌కుమార్ రాజేశ్, విజయ్, రాజేశ్వర్ సురేష్, మహేందర్, స్వామి, యశ్వంతరావు, తదితరులు పాల్గొన్నారు.

'రైతులపై కేసులు ఎత్తివేయాలి'

తలమడుగు: రుణమాఫీ చేయాలని నిరసన తెలిపిన రైతులపై పెట్టిన కేసులను వెంటనే ఎత్తివేయాలని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు జోగు రామన్న డిమాండ్ చేశారు. బుధవారం మండలంలోని రుయ్యాడిలో రైతులను పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం రైతు రుణమాఫీ చేశామని గొప్పలు చెప్పుకోవడం కాదన్నారు. ఎక్కడ 60 శాతం పైగా రైతులకు రుణమాఫీ కాలేదన్నారు. శాంతియుతంగా నిరసన తెలిపే రైతులపై కేసులు పెట్టడం సరికాదన్నారు. ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే రైతులకు షరతులు లేకుండా రుణమాఫీ చేయాలన్నారు. బీఆర్ఎస్ నాయకులు కిరణ్ కుమార్, తోట వెంకటేష్, ప్రహ్లద్, సుదర్శన్ రెడ్డి, గంగాధర్, పల్లవి, ప్రకాష్ పాల్గొన్నారు.

'ఓపెన్' పరీక్ష ఫీజు చెల్లించండి

ఆదిలాబాద్‌టౌన్: ఉమ్మడి జిల్లా పరిధిలోని ఓపెన్ స్కూల్ అధ్యయన కేంద్రాల్లో టెన్త్, ఇంటర్‌లో ప్రవేశం పొందిన అభ్యాసకులు పరీక్ష ఫీజు చెల్లించాలని డీఈవో ప్రణీత, ఓపెన్ స్కూల్ కోఆర్డినేటర్ అశోక్ ప్రకటనలో తెలి పారు. అక్టోబర్‌లో పరీక్షలుంటాయని, ఈ నెల 22 నుంచి సెప్టెంబర్ 9 వరకు ఆన్‌లైన్‌లో ఫీజు చెల్లించాలని పేర్కొన్నారు. వివరా లకు అధ్యయనకేంద్రంలో సంప్రదించవచ్చు.

సంకల్ప్ కార్యక్రమంలో పోస్టుల భర్తీ

ఆదిలాబాద్‌టౌన్: వైద్యారోగ్య శాఖలో చేపడుతున్న సంకల్ప్ కార్యక్రమంలో భాగంగా కాంట్రాక్ట్ పద్ధతిన పోస్టులను భర్తీ చేస్తున్నట్లు జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారి కృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 26లోగా దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. దరఖాస్తు ఫారాలను మెయిల్ thanigaipaeds@gmail.com కు పంపించాలని సూచించారు. ప్రాజెక్ట్ రిసర్చ్ సైంటిస్ట్ ఒక పోస్టు, 19 ఏఎస్ఎం పోస్టులు, సీనియర్ ఫీల్డ్ ఇన్వెస్టిగేటర్ ప్రాజెక్ట్ నర్సు ఐదు పోస్టులు, మూడు డాటాఎంట్రీ ఆపరేటర్ పోస్టులు, ప్రాజెక్ట్ రిసెర్చ్ సైంటిస్ట్ పోస్టులు 4 ఖాళీగా ఉన్నాయని డీఎంహెచ్‌వో వివరించారు.

సంక్షిప్త వార్తలు

ఆడ పిల్లలకు అండగా షీటీం

ఉట్నూర్‌రూరల్: ఆడపిల్లలకు అండగా షీటీం సీఐ మొగిలి, ఎస్సై మనోహర్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని గిరిజన గురుకుల బాలికల డిగ్రీ కళాశాలలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎవరైనా ఆకతాయిలు ఇబ్బందులకు గురిచేస్తే 100, షీటీంకు ఫిర్యాదు చేయాలన్నారు. అనంతరం మత్తు పదార్థాలపై వ్యాసరచన పోటీలు నిర్వహించి గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ బానోత్ హరిత, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

వయోవృద్ధులకు బస్సుల్లో రాయితీ ఇవ్వాలి

ఆదిలాబాద్‌టౌన్: వయోవృద్ధులకు ఆర్టీసీ బస్సుల్లో రాయితీ కల్పించాలని వయోవృద్ధుల సమైక్య అధ్యక్షుడు దేవిదాస్ దేశ్‌పాండే అన్నారు. బుధవారం జాతీయ వయోవృద్ధుల దినోత్సవాన్ని పురస్కరించుకొని పట్టణంలో కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వృద్ధులపై ప్రత్యేక శ్రద్ధ కనబర్చి మరింత మెరుగైన వైద్యసేవలు అందించేలా చర్యలు చేపట్టాలని కోరారు.

ప్రభుత్వం స్పష్టమైన ప్రకటన చేయాలి

కైలాస్‌నగర్: రుణమాఫీ విషయంలో రైతులు ఆందోళన చేయకుండా రాష్ట్ర ప్రభుత్వం స్పష్టమైన ప్రకటన చేయాలని భారతీయ కిసాన్ సంఘ్ నాయకులు భూమారెడ్డి, బలవంత్ బుధవారం కలెక్టర్ రాజర్షి షాకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రుణమాఫీ జరుగక జిల్లాలోని వేలాది మంది రైతులు ఆందోళన చెందుతున్నారన్నారు. బ్యాంకులు, వ్యవసాయ శాఖ అధికారుల చుట్టూ తిరుగుతూ తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు.

చట్టాలపై అవగాహన ఉండాలి

ఆదిలాబాద్‌టౌన్: ప్రతిఒక్కరూ చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి సౌజన్య అన్నారు. బుధవారం పట్టణంలోని కేఆర్‌కే కాలనీలో గల వృద్ధాశ్రమాన్ని సందర్శించారు. వయోవృద్ధుల దినోత్సవాన్ని పురస్కరించుకొని వృద్ధులకు సంబంధించిన చట్టాల గురించి వివరించారు. ఏవైనా ఇబ్బందులు ఉంటే అధికారుల దృష్టికి తీసుకెళ్లాలని సూచించారు.

జాతీయ లోక్ అదాలత్ విజయవంతం చేయాలి

బోథ్: సెప్టెంబర్ 9న నిర్వహించనున్న జాతీయ లోక్‌అదాలత్‌ను విజయవంతం చేయాలని బోథ్ జూనియర్ సివిల్ కోర్టు జడ్జి బి.హుస్సేన్ అన్నారు. బుధవారం కోర్టు ప్రాంగణంలో న్యాయవాదులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో వామన్ రావ్ దేశ్‌పాండే, సుభాష్, అంగద్ కేంద్రె, రూపేందర్, కుమ్మరి విజయ్, ఆడెపు హరీష్, ధమ్మపాల్, తదితరులు పాల్గొన్నారు.

ఎస్పీని కలిసిన కాలనీవాసులు

ఆదిలాబాద్‌టౌన్: పట్టణంలోని కైలాస్‌నగర్ కాలనీవాసులు జిల్లా ఎస్పీ గౌస్ ఆలంను బుధవారం కలిశారు. కాలనీలోని ఎన్జీఓ సొసైటీ ప్లాట్లను కొందరు వ్యక్తులు కబ్జా చేసేందుకు ప్రయత్నిస్తున్నారని ఆయన దృష్టికి తీసుకెళ్లారు. ఈ సందర్భంగా ఎస్పీకి వినతిపత్రం అందించి వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. కై లాస్‌నగర్ డెవలప్‌మెంట్ కమిటీ అధ్యక్షుడు లోక ప్రవీణ్ రెడ్డి, కాలనీవాసులు దుర్గం శేఖర్, రాంకుమార్, రాంకిషన్, కొండల్‌రావు, గంగారెడ్డి, రాహుల్ పాల్గొన్నారు.

దివ్యాంగులకు పరీక్షలు

బోథ్: మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో బుధవారం దివ్యాంగులకు ఉపకరణాలు ఇచ్చేందుకు పరీక్షలు నిర్వహించారు. సీడీపీవో సౌందర్య, మోసిన్, రాకేష్, శివాశివ్ పట్నాయక్, ప్రమోద్, శివసాయి, ఐఆర్‌పిఎస్ జె.భూమన్న, ఎం.భూమన్న, మహేందర్, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల ఆరోగ్యంపై దృష్టి సారించాలి

నార్నూర్ : గిరిజన సంక్షేమ శాఖ ఆశ్రమ పాఠశాలలో చదువుతున్న విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని డిప్యూటీ కలెక్టర్, మండల ప్రత్యేక అధికారి గంగాధర్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని బాలికల ఆశ్రమ పాఠశాలను సందర్శించారు. ఆయన వెంట పాఠశాల ప్రధానోపాధ్యాయులు విఠల్, వార్డెన్ వనిత, పీడీ విశ్వనాథ్, తదితరులు ఉన్నారు.

చట్టాలను గౌరవించాలి

బజార్‌హత్నూర్: నేటి యువత చట్టాలను గౌరవించాలని, చట్టవ్యతిరేకమైన కార్యకలాపాలకు పాల్పడవద్దని, డ్రగ్స్‌కు, చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని బోథ్ సీఐ రమేశ్ సూచించారు. బుధవారం మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాలలో విద్యార్థులకు మత్తుపానీయాలు, డ్రగ్స్ వల్ల కలిగే పరిణామాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు తల్లితండ్రుల ఆశయాలను నెరవేర్చేలా కష్టపడి, ప్రణాళికాబద్ధంగా చదివి లక్ష్యాన్ని చేరుకోవాలన్నారు. ర్యాగింగ్, ఈవ్‌టీజింగ్‌లకు దూరంగా ఉండాలన్నారు. ఎస్సై అప్పారావ్, ప్రిన్సిపాల్ రాజశేఖర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

డీఎంహెచ్‌వోకు సన్మానం

ఆదిలాబాద్‌టౌన్: జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారిగా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన కృష్ణ ను ఆదివాసీ కాంగ్రెస్ జిల్లా చైర్మన్ సెడ్మకి ఆన ంద్‌రావు సన్మానించారు. బుధవారం డీఎంహెచ్‌ఓ కార్యాలయంలో శాలువాతో సత్కరించి పుష్పగుచ్చాలు అందజేశారు. ఏజెన్సీ ప్రాంతంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించేలా కృషి చేయాలని కోరారు.

పీఆర్టీయూతోనే సమస్యల పరిష్కారం

తలమడుగు: పీఆర్టీయూతోనే ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కారం అవుతాయని ఆ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కూడాల రవీందర్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ హైస్కూల్‌లో సంఘం సభ్యత్వ నమోదు చేపట్టారు. మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మహేందర్ యాదవ్, రవీందర్, జిల్లా బాధ్యులు వినోద్ రెడ్డి, స్వామి, తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అవగాహన ఉండాలి

ఇంద్రవెల్లి: సైబర్ నేరాలపై ప్రతీ విద్యార్థి అవగాహన కలిగి ఉండాలని ఎస్సై దుబ్బాక సునీల్ అన్నారు. బుధవారం మండలంలోని ముత్నూర్ బాలికల ట్రైబల్ వెల్ఫేర్ ఆఫ్ గ్రేడ్ రెసిడెన్షియల్ జూనియర్ కళాశాల, హీరాపూర్ కేజీబీవీ, పోస్ట్‌మెట్రిక్ కళాశాలలో పోలీసుల ఆధ్వర్యంలో మాదక ద్రవ్యాల నిర్మూలనపై విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ప్రిన్సిపాల్ శ్రీప్రియ, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

బీజేవైఎం స్టేట్ ఎగ్జిక్యూటివ్ మెంబర్‌గా రాకేశ్

ఆదిలాబాద్: జిల్లా కేంద్రానికి చెందిన పద్మావార్ రాకేశ్ బీజేవైఎం స్టేట్ ఎగ్జిక్యూటివ్ మెంబర్‌గా నియామకమయ్యారు. ఈ మేరకు రాష్ట్ర అధ్యక్షుడు మహేందర్ నియామకపత్రం అందజేశారు.

మాదకద్రవ్యాల బారిన పడొద్దు

తాంసి: విద్యార్థులు మాదక ద్రవ్యాల బారిన పడి జీవితాన్ని నాశనం చేసుకోవద్దని భీంపూర్ ఎస్సై కలీం సూచించారు. బుధవారం భీంపూర్ మండలంలోని అందర్‌బంద్ గిరిజన ఆశ్రమోన్నత పాఠశాలలో విద్యార్థులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. హెచ్‌ఎం రాజశేఖర్ పాల్గొన్నారు.

విద్యార్థులకు అవగాహన

నేరడిగొండ: విద్యార్థులు మాదకద్రవ్యాలకు అలవాటుపడి బంగారు భవిష్యత్తును నాశనం చేసుకోవద్దని ఎస్సై శ్రీకాంత్ అన్నారు. మాదకద్రవ్యాల నిర్మూలపై బుధవారం కేజీబీవీలో అవగాహన సదస్సు నిర్వహించారు.

ధ్యానం చేయడం అలవర్చుకోవాలి

తలమడుగు: ప్రతి ఒక్కరూ ధ్యానం చేయడం అలవర్చుకోవాలని సీనియర్ పిరమిడ్ మాస్టర్ సునీత వెంకట్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ హైస్కూల్‌లో ధ్యానచైతన్య సదస్సు నిర్వహించారు. హెచ్‌ఎం వెంకట్‌రావు, పిరమిడ్ మాస్టర్ అనుష, సునీతరెడ్డి పాల్గొన్నారు.

నిత్యాన్నదాన కేంద్రం వార్షికోత్సవం

ఆదిలాబాద్‌టౌన్: రిమ్స్ ఆస్పత్రిలో గల సత్యసాయి నిత్యాన్నదాన కేంద్రం వార్షికోత్స వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. సభ్యులు నర్సింగ్‌రావు, విలాస్, తదితరులు పాల్గొన్నారు.

ఎండీఎం కార్మికుల నిరసన

ఆదిలాబాద్‌టౌన్: సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ మధ్యాహ్న భోజన కార్మికులు బుధవారం డీఈఓ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేశారు. పెండింగ్‌లో ఉన్న వేతనాలను, బిల్లులను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. నాగమణి, సుజాత, లక్ష్మి, పుష్ప, రాధ పాల్గొన్నారు.

ఎస్సైకి సన్మానం

బోథ్: బోథ్ ఎస్సైగా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన ఎల్. ప్రవీణ్‌ను బుధవారం బీజేపీ, కాంగ్రెస్ నాయకులతో పాటు బోథ్, సొనాల గ్రామస్తులు శాలువాతో సత్కరించారు.

ఆన్‌లైన్ ద్వారా విద్యుత్ బిల్లుల చెల్లింపు

తలమడుగు: విద్యుత్ వినియోగదారులు ఇకనుంచి ఆన్‌లైన్‌లో గూగుల్ పే, ఫోన్‌పే ద్వారా కూడా విద్యుత్ బిల్లులు చెల్లించవచ్చని విద్యుత్ శాఖ డీఈ హరికృష్ణ అన్నారు. బుధవారం సుంకిడిలో కమర్షియల్ సర్వీస్‌లను తనిఖీ చేశారు.

దరఖాస్తుల స్వీకరణ

ఇచ్చోడ: వివిధ కారణాలతో రుణమాఫీకాని రైతుల నుంచి బుధవారం మండల కేంద్రంలోని రైతు వేదికలో ఏఈవోలు దరఖాస్తులు స్వీకరించారు.

ఏజీపీ శంకర్‌కు సన్మానం

బోథ్: ఆదివాసీ న్యాయవాదికి ఏజీపీగా అవకాశం రావడం సంతోషంగా ఉందని తుడుందెబ్బ రాష్ట్ర ఉపాధ్యక్షులు గోడం గణేశ్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలో శంకర్‌ను శాలువాతో సత్కరించారు. రాష్ట్ర కార్యదర్శి కొడప నగేష్, ఐటీడీఏ మాజీ డైరెక్టర్ మేస్రం భూమన్న పాల్గొన్నారు.

వేతనాలు చెల్లించాలని వినతి



వినతిపత్రం ఇస్తున్న మల్టీపర్పస్ వర్కర్లు

నార్నూర్: గ్రామ పంచాయతీ పరిధిలో పనిచేస్తున్న తమకు పెండింగ్ వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ బుధవారం మండలంలోని అన్ని గ్రామ పంచాయతీలకు చెందిన మల్టీపర్పస్ వర్కర్లు ఎంపీవో స్వప్నశీలకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సంఘం నాయకులు మాట్లాడుతూ గ్రామ పంచాయతీ పరిధిలో శానిటేషన్, క్లోరినేషన్ పనులు, మురికి కాలువలు శుభ్రం చేయడంతో పాటు దోమల నివారణకు కష్టపడి పని చేస్తున్నామన్నారు. ఏడు నెలలుగా వేతనాలు ఇవ్వకపోవడంతో ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నామన్నారు. వెంటనే వేతనాలు మంజూరు చేయాలని కోరారు. జాదవ్ జ్ఞానేశ్వర్, సంతోష్, భీంరావు, అర్జున్, దినేష్ పాల్గొన్నారు.